ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts
సంపుటి - 02 సంచిక -340 పేజీలు - 8 వెల - 03/- శనివారం 28 మార్చి 2026

# టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలి

**సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...**

**పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష**

**ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ**

**ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం**

**చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు**





**న్యూఢిల్లీ,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.
అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. **మిగతా 2లో...**

# కమనీయం.. సీతారామ కళ్యాణం

**మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం**

**పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు**

**రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు**

**పలువురు మంత్రులు, ప్రముఖుల రాక**




## సీఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు**



**న్యూఢిల్లీ,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )** నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. **మిగతా 2లో...**

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

**పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు**

**సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ**

**పెట్రోల్‌పై రూ.13, డీఇల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం**

**న్యూఢిల్లీ,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా **మిగతా 2లో...**




## అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

**: జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న**

**అమరావతి రాజధానిపై జగన్ వైఖరి చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్**

**'జే టర్న్ జగన్' అంటూ సోషల్ మీడియాలో విమర్శ**

**ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని తమ నినాదమని స్పష్టీకరణ**

**టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని శ్రేణులకు పిలుపు**

**ఇంటిపై జెండా ఎగరేసి, సోషల్ మీడియా డీపీలు మార్చాలని సూచన**




# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

**ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్**

**ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి**

**చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం**

**ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక**

**అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. **మిగతా 2లో...**



## మిషన్ కర్మయోగిలో ఎపి ఆదర్శం

**ఇది గర్వకారణమని పేర్కొన్న చంద్రబాబు**

**అమరావతి,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
దేశవ్యాప్తంగా అమలవుతున్న మిషన్ కర్మయోగిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సాంకేతికత ఆధారిత శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు మెరుగుపడుతోందని. **మిగతా 2లో...**



# కుట్ర కోణం

**రఘురామపై దాడిని ఖండించిన పవన్..**

**ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై దాడి**

**దాడి వెనుక కుట్ర కోణం ఉందని అనుమానం వ్యక్తం చేసిన పవన్**

**దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచన**

**గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**అమరావతి,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై జరిగిన దాడిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. పండుగ రోజున, ఆలయం వద్ద జరిగిన ఈ దాడి వెనుక కుట్ర కోణం ఉందని ఆయన **మిగతా 2లో...**



## రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం..

**ఆకివీడులో ఉద్రిక్తత**

**శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఘటన**

**రామాలయ స్థలానికి సంబంధించి రెండు వర్గాల మధ్య కొంత కాలంగా వివాదం**

**రఘురామ రాకను వ్యతిరేకిస్తూ దాడికి యత్నించిన ఒక వర్గం**

**పలువురు కూటమి నేతలకు గాయాలు**

**రఘురామను సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది, పోలీసులు**



# కమనీయం..సీతారామ కళ్యాణం

**భద్రాచలం,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి.
తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద



మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

**మొదటిపేజీ తరువాయి**
అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం..

## ఆకివీడులో ఉద్రిక్తత

**భీమవరంమార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )** ఆకివీడు పెద్దపేటలోని శ్రీరామనవమి వేడుకల్లో ఘర్షణ రాజుకుంది. ఓ వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో జనసేన నాయకుడికి, ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పెద్దపేటలోని రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ వేడుకలను పెదపేటలోని ఒక వర్గం బహిరంగంగానే వ్యతిరేకించినట్లు సమాచారం. హరిజన పేటలో రామాలయంకు వారు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. మరో వర్గం అనుకూలంగా ఉంది. ఈ స్థితిలో రామాలయం నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇటీవల



ప్రకటించారు. ఎమ్మెల్యే అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్న ఒక వర్గం ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకను వ్యతిరేకించారు. అయినప్పటికీ పోలీసులు బందోబస్తు మధ్య రఘురామ కృష్ణంరాజు రామాలయంలోకి వచ్చి హారతిచ్చి కొబ్బరికాయలు కొట్టి వెళ్లిపోయారు. అయితే రఘురామకృష్ణ రాజు రాకను వ్యతిరేకించిన వర్గీయులు ఆయన రాకను అడ్డుకున్నారు. దాడికి దిగారు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరిపై ఎమ్మెల్యే వెళ్ళిపోగానే మరోసారి దాడి జరిగింది. ఈ దాడిలో జనసేన నాయకుడు గవర అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. అతనిపై ఇనప వస్తువులు గాజు వస్తువులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వీరందరినీ స్థానిక పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వైద్య సహాయం అందించారు. దాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. అయితే ఈ దాడి ఒక పథకం ప్రకారం ఎమ్మెల్యే పై జరగవలసిందని, తప్పిందని అక్కడ కొందరు గుసగుసలాడుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం ఎమ్మెల్యే చెవికి చేరడంతో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కార్యకర్తల పై దాడి తనపై చేసిన ప్రయత్నం ఎలాంటి పరిస్థితుల్లో వదిలేది లేదని హెచ్చరించారు.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

## మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి -సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )** కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు.
న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు



చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**
పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# టీమిండియా స్ఫూర్తితోపనిచేయాలి

**మొదటిపేజీ తరువాయి**
ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.
ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**మొదటిపేజీ తరువాయి**
మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

## : జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న

**అమరావతి,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
అమరావతి రాజధాని అంశంపై వైసీపీ అధినేత జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. "ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని మా నినాదం. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అమరావతి పై మీ స్టాండ్ ఏంటి జే టర్న్ జగన్ గారూ?" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన సవాల్ విసిరారు. రాజధానిపై తమ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేస్తూనే, జగన్‌ను లోకేశ్ సూటిగా ప్రశ్నించారు.మరోవైపు, తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో లోకేశ్ ట్వీట్ చేశారు.
"తెలుగువారి ఆత్మగౌరవం కోసం, అణగారిన వర్గాలకు అండగా మన తెలుగుదేశం పార్టీ పుట్టి 44 సంవత్సరాలైంది. తెలుగుదేశం కుటుంబ సభ్యులమైన మనకు ఇది గర్వకారణమైన సందర్భం. ఆవిర్భావ స్ఫూర్తి, ఐకమత్యం చాటే సమయం ఇది. ఇది ఒక చిత్రం కాదు... రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమ, సకల శుభాల గెలుపుకు సంకేతమైన పసుపు జెండా ప్రస్థానం. మీ సోషల్ మీడియా ఖాతాలలో డీపీని పెట్టి, మీ ఇంటిపై పార్టీ జెండా ఎగరేసి 'నేను తెలుగు వాడిని... నాది తెలుగుదేశం పార్టీ' అని గర్వంగా చాటండి" అంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

# మిషన్ కర్మయోగిలో ఎపి ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి**
తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. ఐజీఓటీలో ఏపీ తరఫున కోటికిపైగా కోర్సులు పూర్తి చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కర్మయోగి భారత్ చేసిన ట్వీట్‌ను ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు రీట్వీట్ చేశారు. ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మరో ముఖ్యమైన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు 'సాధన సప్తాహ' జాతీయ లెర్నింగ్ వీక్‌ను నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వారం రోజులపాటు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు చురుకుగా పాల్గొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) కోర్సును పూర్తి చేయడం తప్పనిసరి చేయడం జరిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వ్యవస్థను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మార్చి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పెట్టుకుందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని, సామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడం, మెరుగైన సేవలు అందించడమే 'సాధన సప్తాహ' ఉద్దేశమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కుట్ర కోణం

**మొదటిపేజీ తరువాయి**
అనుమానం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులోని రామాలయంలో పూజలకు వెళుతున్న సమయంలో రఘురామకృష్ణరాజు, ఆయన అనుచరులు, జనసేన నాయకులపై కొందరు వ్యక్తులు ఆయుధాలతో దాడికి పాల్పడ్డారని పవన్ వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకొనే శ్రీరామ నవమి రోజున ఈ దాడి జరగడం దారుణం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.
ఈ ఘటనను అత్యంత తీవ్రమైనదిగా పరిగణించాలని, దాడి వెనుక ఉన్న సూత్రధారులను విచారణ ద్వారా గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించారు. ఈ దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# రాజకీయాలకు బ్రేక్.. ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.
ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు
ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు



రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు.
ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.


## మధ్యాహ్న భోజన పథకంపై

# గరికపాటి వాఖ్యలు సిగ్గుచేటు

**పిల్లలకు క్షమాపణలు చెప్పాలి**

**గర్వమున కళ్ళు గానక తిరుగువాడు గోతిలో పడుట తథ్యము"**

**నంద్యాల, మార్చి 28, (రిపబ్లిక్ న్యూస్):**




గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆళ్లగడ్డ మండల్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. శుక్రవారం ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల్ కార్యదర్శి లతీఫ్ మాట్లాడుతూ వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిథ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి". ఏనాడయిన కార్పోరేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటు పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గిరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి.

# రసిక రాజాలు..

## - ఓవైపు దేశవ్యాప్తంగా రామనవమి జరుపుకుంటుంటే ఇక్కడ మాత్రం అసభ్య నృత్యాలు..

**- వాళ్ళిద్దరూ ఉన్నత హోదా లో ఉన్న వాళ్లే..!**

**- లేలే నా రాజా లేవాలోయ్.. కసికొద్దీ లేవాలోయ్ అన్నట్టుగా వన్స్ మోర్ అంటూ ఎంకరేజ్..**

**- సతీష్ యాదవ్ కాదు. ఆయనకు మించి దువ్వూరు వినయ్ రెడ్డి రెచ్చిపోయి మరి ఇరగదీసిండు..**

**ఏపీ బ్యూరో, మార్చి 27 - (రిపబ్లిక్ న్యూస్) -**



అది మాములు కామం కాదు. గేట్లు ఎత్తిన ప్రాజెక్టు లాగా దూకింది. ప్రతీ యాంగిల్ లోనూ కసి తారాస్థాయికి చేరింది. ఒక్కో సీన్ ఒక్కో రేంజ్ లో ఉంది. ఆ వీడియో తీసే వాళ్లకేమో కానీ. చూసేవాళ్లకు మాత్రం నేత్రానందం. బిట్లుబిట్లుగా చూసినా కలిపి చూసినా వామ్మో అని నోరెళ్లబెట్టేలా ఉంది. అసలువీళ్లు ప్రజాప్రతినిధులేనా ఇటువంటి వారు ప్రజాప్రతినిధులు ఎలా అవుతారనే అనుమానం ఆ వీడియో చూసిన ప్రతీ ఒక్కరి లోనూ కలుగుతోంది. అన్నట్టు ఆ రాసలీలల వీడియోలో ఉన్నది ముక్కూ ముఖం తెలియని వ్యక్తి కాదు. సాక్షాత్తూ ప్రజాప్రతినిధి. పైగా ఏపీలో అధికారంలో ఉన్న ఓ పార్టీలో కీలక నాయకుడు. అతడు తమ్మినపట్టణం కోదండరామస్వామి ఆలయంలో చైర్మన్ గా పని చేస్తున్నాడు. అతడి కామలీలలను పక్కనే ఉన్న వారు వీడియో తీశారు. అతడు రెచ్చిపోతుంటూ లేలే నా రాజా లేవాలోయ్. కసికొద్దీ లేవాలోయ్ అన్నట్టుగా వన్స్ మోర్ అన్నట్టుగా ఎంకరేజ్ చేశారు. సతీష్ యాదవ్ అలా చేశాడంటే ఆయన పక్కనే ఉన్న బొల్లవోలు టీడీపీ నాయకుడు వినయ్ రెడ్డి అంతకుమించి అనే రేంజ్ లో రెచ్చిపోయాడు. దుస్తులు విప్పి మరీ తన సామర్థ్యాన్ని చూపించాడు. ఎవడైనా సరే. వాడు ఎంత పుడింగి మగాడైన సరే ఓ స్థాయిలో స్లో డౌన్ అవుతాడు. కానీ సతీష్ యాదవ్, వినయ్ రెడ్డి ఏమాత్రం తగ్గలేదు. పైగా వినయ్ రెడ్డి దుస్తులు విప్పి మరీ తన సామర్థ్యాన్ని ఆ అమ్మాయికి చూపించాడు. సతీష్, వినయ్ రెడ్డి ఇద్దరూ కలిసి ఆ అమ్మాయి తో చిందులుతొక్కారు. సరసాలు ఆడారు. కొంటెగా స్టెప్పులు వేశారు. దుస్తులు విప్పి నాగినీ డ్యాన్సులు వేశారు. ఈ తతంగం మొత్తం ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. చూసినవాళ్లకు చూసినంత అన్నట్టుగా 'నీలి' ఆనందాన్ని కన్నులనిండుగా పంచుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమ్ముళ్లు కట్టు తప్పుతున్నారు. అధికారం ఉంది కదా అని రెచ్చిపోతున్నారు. ఈ వీడియో చూసిన లక్షలాది మంది నోరెళ్లబెట్టి విమర్శిస్తుంటే వారికి మద్దతుగా వైసీపీ వాళ్లు తమ్మదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమి పార్టీ వాళ్లేమో ఇది ఏఐ మహిమ అంటూ కొట్టి పారేస్తున్నారు. ఒకవేళ ఇది నిజమైతే కూటమి ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకోవాలి. శ్రీరామనవమి ఇలాంటి వీడియోలు దర్శనమివ్వడం పలువురికి ఆగ్రహం తెప్పిస్తోంది. తూర్పున ఉదయించేది చంద్రుడే కదా అంటే ఏంటో అనుకున్న రాసలీలలా రూపం లో నెలకి ఒకడు ఉదయిస్తున్నాడు. తమ్మినపట్టణం కోదండ రామస్వామి ఆలయ చైర్మన్ సతీష్ యాదవ్ రాసలీలలు బొల్లవోలు టీడీపీ నాయకుడు దువ్వూరు వినయ్ రెడ్డి దుస్తులు విప్పి రెచ్చిపోతూ రాసలీలలు ఇప్పుడు ఏపీ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా శ్రీరామనవమిని జరుపుకుంటుంటే ఆంధ్రాలోని నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం లో జరిగిన ఈ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉంది.

# ధర్మానికి శ్రీరాముడు ఆదర్శం

## శ్రీరాముని జీవితం సమాజానికి మార్గదర్శకం - కమిషనర్ పి.విశ్వనాథ్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 27)**

శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచి సత్యం, న్యాయం, నీతి మార్గాలను సమాజానికి చూపించిన మహానుభావుడని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఆయన చరిత్ర నేటి సమాజానికీ మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు.

శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా నగరంలోని పాతబస్తీ తెలుగు వీధిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన శోభాయాత్రను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాముని ఆచరణలోని ధర్మం, సహనం, కర్తవ్యనిబద్ధత వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

కుటుంబ, సామాజిక జీవనంలో నైతిక విలువలు పెంపొందినప్పుడే సమాజం శాంతి, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. పండుగలను కేవలం ఆనందోత్సవాలుగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసుకునే సందర్భాలుగా భావించాలని సూచించారు.

శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో నిర్వహించడం ద్వారా సమాజంలో సౌహార్ద వాతావరణం మరింత బలపడుతుందని కమిషనర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శేషగిరి శెట్టి, కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష, మాజీ కార్పొరేటర్ రంగస్వామి, కైప పద్మలత, నాయకులు ప్రతాప్ రెడ్డి, హనుమంతు, అనిల్, నవీన్, నిర్వాహకులు భార్గవ్, ప్రేమ్, నవీన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు

# వాడ వాడలా శ్రీరామనవమి వేడుకలు



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 27 రిపబ్లిక్ న్యూస్** శ్రీరామనవమి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ సీతారాముల ఆలయంలో విశేష పూజలు జరిగాయి. గడ్డంవారిపల్లి వద్దగల వీరాంజనేయ స్వామి ఆలయంలో మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండుగల జరిగింది. అంతేకాకుండా అగ్రహారం ఆనందాచార్యుల ఆధ్వర్యంలో బిల్లేరు గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం రాత్రి వీధి నాటకం వంటివి నిర్వహించారు. దీంతోపాటు చౌడేపల్లి పట్టణంలోని హరిమందరంలో ఆర్యవైశ్యులచే సీతారాములకు వివిధ అభిషేకాలు అలంకరణ పలు కార్యక్రమాలు నిర్వహించారు శ్రీరామ నవమిని పురస్కరించుకుని వాడ వాడల శ్రీ లక్ష్మణ, హనుమాన్, సీత సమేత శ్రీరామచంద్రుడికి విశేష పూజలు జరిగాయి.


# వైష్ణవి దేవి ఆలయంలో నవమి పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 27 రిపబ్లిక్ న్యూస్**



చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో వసంత నవరాత్రుల్లో 9వ రోజున అనగా శ్రీరామనవమి సందర్భంగా ఆలయ అర్చకరాల శ్రావణి ఉదయమే అమ్మవారికి, అభయాంజనేయ స్వామికి, పంచామృత అభిషేకం చేసి అనంతరం రంగురంగుల పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు .చౌడేపల్లి పుంగనూరు చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అమ్మవారి సన్నిధిలో సౌందర్యలహరి లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆంజనేయ స్వామికి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**గుత్తి మార్చి 27 (రిపబ్లిక్ న్యూస్ )**

శ్రీ రామనవమి పర్వదినాన్ని సందర్భంగా గుత్తి మండలం జక్కల చెరువు గ్రామం లో అత్యంత అంగరంగ వైభవంగా వేద పండితుల మేళ తాళాలతో వేలాదిమంది భక్తాదుల నడుమ సీతారామ కళ్యాణ మహోత్సవం ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్ జనసేన సమన్వయకర్త వాసగిరి మణికంఠ సీతారాముల కళ్యాణం మహోత్సవం పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు,ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినాన ముందుగా నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు, ఆనాటి కాలంలో పరిపాలన ఎలా సాగించారు నేటి యువత నేర్చుకోవాలి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్,పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ఎంపీటీసీ నారాయణస్వామి, గోవిందు,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, రమేష్, రాజా, సర్పంచ్ రామలింగమయ్య, సర్పంచ్ చిదంబర,ఆయకట్టు సర్పంచ్ శ్రీనివాసులు,మాజీ ఎంపీటీసీ నరసింహులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, కె.వి రామకృష్ణ, తిమ్మప్ప, సూరి, పటేల్ సురేష్, మిద్దె ఓబులేష్ , గ్రామ ప్రజలు భక్తాదులు పాల్గొన్నారు



# భారీ అగ్ని ప్రమాదం...

# నివారణకు మంత్రి తక్షణ చర్యలు...

**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 27,ఉరవకొండ**



నియోజకవర్గ పరిధిలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం విషయం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి రాగా, మంత్రి తక్షణమే స్పందించి అగ్నిప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకున్నారు.

**పాల్తూరు గ్రామానికి విద్యుత్ సరఫరా**

వేసవికాలంలో ప్రమాదవశాత్తు పాల్తూరు గ్రామంలో పలువురి రైతుల గడ్డివాములకు భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుని కాలిపోతుండగా, గ్రామస్తులు, నాయకులు ఈ విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ తీసుకెళ్లారు. వెంటనే మంత్రి ఫైర్ శాఖ అధికారులతో మాట్లాడి రాయదుర్గం, కళ్యాణదుర్గం నుంచి వేగవంతంగా ఫైర్ ఇంజన్లను తీసుకువచ్చేలా మంత్రి కృషి చేశారు. మరిన్ని గడ్డివాములకు అగ్నిప్రమాదం జరగకుండా ఫైర్ ఇంజన్లతో వాటిని ఆర్పి వేసేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మంటలు పూర్తిగా అదుపు చేసేందుకు నీటి సరఫరా అవసరం ఉందని, పాల్తూరు గ్రామానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు పాల్తూరు గ్రామానికి సాయంత్రం 5 గంటల నుంచి 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో మంత్రి పయ్యావుల కేశవ్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కుల మతాలకు అతీతంగా సేవ భావం

**దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు**

**గుత్తి మార్చి 27( రిపబ్లిక్ న్యూస్)**

శ్రీరామనవమి పర్వదినాన్ని సందర్భంగా గుత్తి పట్టణంలోని కోట రామస్వామి దేవాలయం ఆవరణంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా భక్తి శ్రద్ధలతో వచ్చిన భక్తులకు శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు కుల మతాలకు అతీతంగా వైఎస్ఆర్సిపి గుత్తి టౌన్ ఐటి వింగ్ అధ్యక్షుడు సులేమాన్ మరియు మిత్రబృందంతో కలిసి హిందూ ముస్లిం క్రిస్టియన్ భారత దేశంలోని పౌరులుగా దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు సోదర సోదరి భావంతో కలసి మెలిసిగా ఉండాలని, ఆలయం కి వచ్చిన భక్తులకు మానవత్వంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హబీబ్ ఖాన్, సాయి,మనోజ్ ,గౌస్ ,గురు నిఖిల్, షేక్షావలి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



**మల్లాపూర్ మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది. అనంతరం రేగుంట హనుమాన్ దీక్షా పీఠం వారి ఆధ్వర్యంలో,హనుమాన్ మందిరం ఆవరణలో మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.అనంతరం హనుమాన్ దీక్ష పీఠం సభ్యులు మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమానికి సహకరించిన దాతలందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, ఉపసర్పంచ్ గనవేని నందిని మల్లేష్, కార్యదర్శి వినీత, వార్డు సభ్యులు కలుసాని రాజన్న, బషీర్, బాస రాజరెడ్డి మహిళా సంఘాల సభ్యులు, హనుమాన్ భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రామాపురంలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు




**బండి ఆత్మకూరు, మార్చి 27, (రిపబ్లిక్ న్యూస్) :-** బండి ఆత్మకూరు మండలం, రామాపురం గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామ కిసాన్ మోర్చా అధ్యక్షులు డొల్లు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బిజెపి కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి, ఆ పార్టీ జిల్లా సెక్రటరీ రామ్ శెట్టి భాస్కర్ లు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో కలిసి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీరాముడి జీవితం ఆదర్శమని, ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు ఆయన జీవితాన్ని అంకితం చేసి దేశ గౌరవాన్ని యావత్ ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందే విధంగా కేంద్రంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశ ప్రజలకు సువర్ణ పరిపాలన అందించిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు దేశాభివృద్ధిని చేసి చూపిస్తూ భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్నారు.అందుకు అనుగుణంగానే పల్లెలే పట్టుకొమ్మలు అనే నినాదంతో గ్రామాల సంపూర్ణ అభివృద్దే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నారు. శ్రీరామ నవమి పురస్కరించుకొని స్థానిక గ్రామ కిసాన్ మోర్చా అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి సహకారంతో రామాపురం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పందేలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డోల్లు శంకరయ్య, బేరి హరిబాబు, డొల్లు రామకృష్ణుడు, నీలకంఠం శ్రీకాంత్, గాజుల వెంకటేష్, సాయన్న గారి రామకృష్ణ, గుండూరు సుభాష్, డోల్లు వెంకటేష్, బింగి వెంకటేష్, ఎర్రం మోహన్ , గండూరి వెంకటరమణ, చాకలి ఎల్లయ్య, దబడపల్లి వెంకట రమణ,బిజెపి నాయకులు అభిమానులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

# వాడవాడలా నవమి ఉత్సవాలు.

## నవమికి నాగా కుటుంబం బారీ అన్నదానం.





**ఓబులవారిపల్లి మార్చి 27 రిపబ్లిక్ న్యూస్.**
శ్రీరామ నవమి సందర్బంగా శుక్రవారం రైల్వే కోడూరు నియోజకవర్గం లోని అన్నిగ్రామాలలో నవమి పూజలు నిర్వహించడం జరిగింది. గ్రామాలలోని ప్రజలు వారి వారి ఊర్లలో ఉన్న రాముని దేవాళయాలలో సీత, రామ, లక్ష్మణ్ లకు పూజలు నిర్వహించారు. కొన్నిగ్రామాలలో అన్న దానాలు నిర్వహించారు. ఓబులవారిపల్లి మండలం చిన్నఓ రంపాడు గ్రామలో నూతనంగా నిర్మించిన రాముల దేవాలయంలో ఆ పంచాయతీ కి చెందిన ప్రముఖ నాయకుడు నాగ శివశంకర్ రెడ్డి ఉదయం రాముల వారికి కుటుంబ సామెతంగా గ్రామస్తులు తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ఎత్తున వేలాది మందికి ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేంద్ర, నరసిహులు, శ్రీనివాసులు, సుబ్బన్న, ఖాజామియా, చంద్ర, నరసింహ రెడ్డీలు పాల్గొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని కార్యక్రమాలు అద్భుతం గా నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో సీతారాముల కు పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పానకం పంచిన అనంతరం సీతారాముల జననం గురించి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు వారు వివరించారు

# ఇంధనంపై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

## ప్రధానికి చంద్రబాబు, లోకేశ్ అభినందనలు



**అమరావతి,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఏపీ స్వాగతిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. సవాళ్ల సమయంలో నాయకత్వ పటిమ బయటపడుతుందన్నారు. క్లిష్టపరిస్థితుల్లో దేశానికి స్థిరత్వం కల్పిస్తున్న మోదీ నేతృత్వం దేశానికి ఓ వరమన్నారు. అనేక దేశాలు ఇంధన ధరల భారం ప్రజలపై మోపుతున్నాయి. భారత్ మాత్రం ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటోంది. ఇది ఎన్డీయే ప్రభుత్వ ప్రజా ప్రాధాన్యానికి నిదర్శనం అని చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు తగ్గించిన ప్రధానికి మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలపై భారం పడకుండా ప్రధాని తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఎక్సైజ్ సుంకం లీటర్ పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై పూర్తిగా రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీయే నిరూపించుకుందని అన్నారు.

--------

# దళిత క్రిస్టియన్లపై సుప్రీంకోర్టు తీర్పు పునఃసమీక్షించాలి

## కర్నూలు కలెక్టరేట్ ఎదుట డీహెచ్పిఎస్ ఆధ్వర్యంలో ధర్నా - ఎస్సీ హోదా కొనసాగించాలని డిమాండ్




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 27)**
దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ, స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ముందు దళిత హక్కుల పోరాట సమితి, కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమం డీహెచ్పిఎస్ జిల్లా కోశాధికారి సి. కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి సి. మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ, దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా లేదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు దేశవ్యాప్తంగా దళిత క్రిస్టియన్లు మాత్రమే కాకుండా ప్రజాసంఘాల్లో కూడా ఆందోళనకు దారితీసిందని పేర్కొన్నారు.

మతం మారినంత మాత్రాన అంటరానితనం పోదని, ఇది వాస్తవానికి విరుద్ధమని వారు అన్నారు. బౌద్ధ, సిక్కు మతాల్లోకి మారిన వారికి ఎస్సీ హోదా కొనసాగుతుండగా, క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు మాత్రం అది వర్తించకపోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

క్రైస్తవ మతంలో కులాలు లేవని చెప్పడం సరైనది కాదని, అదే విధంగా ఇతర మతాల్లో కూడా కుల వ్యవస్థ లేనప్పటికీ అక్కడ ఎస్సీ హోదా కొనసాగుతుందన్నారు. ఇతర కులాల వారు క్రైస్తవ మతంలోకి మారినప్పటికీ తమ బీసీ తదితర హోదాలను కొనసాగించుకుంటుండగా, దళితులు మాత్రం ఎస్సీ హోదా కోల్పోవడం సరైంది కాదని అన్నారు.మత మార్పిడి వల్ల అంటరానితనం పూర్తిగా తొలగిపోతే దేశంలో ఇప్పటికి అది పూర్తిగా నిర్మూలించబడేదని వారు తెలిపారు. అందువల్ల దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించడం సామాజిక భద్రత కోణంలో అవసరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో విస్తృత స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కుమార్ రాజా, అశోక్, సుధాకర్, మాధవరావు, మల్లన్న, ఏసన్న, ఏసు, సాలన్న, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు







**రిపబ్లిక్ ప్రతినిధి, మార్చి 27, అనంతపురం**
శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అనంతపురం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని శ్రీ కోదండ రామాలయం ప్రత్యేక పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి దేవుణ్ణి దర్శించేందుకు తీర్చిదిద్దారు. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక పరిమళంతో నిండిపోయింది. పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పోలీస్ కుటుంబాల్లో ఐక్యత, ఆధ్యాత్మికతను పెంపొందించేలా జరిగింది. దేవాలయంలోని మండపాన్ని ప్రత్యేక సుగంధ పూలతో అలంకరించారు.కార్యక్రమం మొత్తం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ భక్తి భావంతో పాల్గొన్నారు. పోలీస్ శాఖలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

### మంగళ వాయిద్యాల మధ్య కల్యాణోత్సవం

ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆయన సతీమణి హేమ జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ దంపతుల చేతుల మీదుగా శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం జరిపారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివార్లను వేడుకున్నారు. ఈ కళ్యాణోత్సవాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కళ్యాణ కార్యక్రమం సమయంలో ఆలయంలో భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా తలంబ్రాలు చల్లే కార్యక్రమం ఎంతో భక్తి భావంతో జరిగింది. కార్యక్రమం మొత్తం సంప్రదాయ పద్ధతిలో నిర్వహించడం విశేషంగా నిలిచిందని చెప్పవచ్చు.

### జిల్లా ఎస్పీ చేతుల మీదుగా శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం

ఈ వేడుకలలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణం అంతా పోలీసుల కుటుంబాల వ్యక్తులతో నిండిపోయింది.శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం అనంతరం జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ దంపతులు స్వామివారిని ప్రార్థించారు. జిల్లాలో శాంతి భద్రతలు సక్రమంగా ఉండాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీస్



సిబ్బంది, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నవమి సందర్భంగా ప్రసాదం, ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ఎంతో సాఫీగా పోలీస్ శాఖ నిర్వహించగా వారిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అశ్విన్ మణిదీప్, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, మహిళా విభాగం డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, డిటిసి డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐలు ధరణీకిశోర్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఆర్ఐలు మధు, పవన్ కుమార్, రాముడు, జిల్లా పోలీస్ కార్యాలయం బి సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, పోలీస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ, పోలీస్ సిబ్బందిని అధికారులు అభినందించారు. భక్తి, సేవ, ఐక్యతను చాటిన ఈ శ్రీరామ నవమి వేడుకలు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ కుటుంబాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తి, ఆనందం, సేవా భావం కలగలిపిన ఆధ్యాత్మిక వేడుకలు పోలీసుల కుటుంబాల్లో ఆనందకరంగా నిలిచాయి.

# ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేయండి.







**ఓబులవారిపల్లి మర్చి 27రిపబ్లిక్ న్యూస్.**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పథంలో అభివృద్ధి కావడానికి, యత్రికులకు సౌకర్యాలు కల్పనలో భాగంగా ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ చిన్నదిగా ఉన్నందువలన స్టేషన్ ను పెద్దదిగా అభివృద్ధి చేయాలని, గుంతకల్లు రైల్వే డివిజన్ డి ఆర్ సి సభ్యుడు, రాయలసీమ బూత్ కమిటీ వై యస్ ఆర్ సీ పి అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి శుక్రవారం గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డి ఆర్ యం )చంద్రశేఖర్ గుప్తా ను కోరారు, ఒంటిమిట్ట శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తాను

కలిసి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ను అభివృద్ధి పరచాలని ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ నందు ఫుట్ అవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫామ్ ఎక్స్టెన్షన్, స్టా పేజెస్, పనులను మంజూరు చేయించి మీవంతు సహాయంగా ఈ ప్రాంతానికి సహకరించాలని తల్లెం భరత్ కుమార్ రెడ్డి వినతి పత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు, పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, రాజ్య సభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, శాసన సభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ అభివృద్ధి కొరకు మరియు అన్ని ప్రయానికుల రైళ్లు ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ లో నిలుపుదలకు గతంలో సెంట్రల్ మినిస్టర్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందని అయన సానుకూలంగా స్పందించారు , మీరు కూడా స్పందించి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ను అభివృధి పథం లో ముందుకు తీసుకెలెందుకు కృషి చేయాలని విన్నవించారు, ఈ కార్యక్రమంలో ఏ డిఆర్ఎం సుదర్శన్ రెడ్డి, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, సిసిఐ జనార్ధన్, ఆర్ పి ఎఫ్ సిఐ కోటేశ్వరరావు ఆర్పిఎఫ్ ఎస్సై వనిత, జి ఆర్ పి ఎఫ్ ఎస్సై సునీల్ రెడ్డి, గల్లా శ్రీనివాసులు, శివకుమార్ రెడ్డి,స్థానిక వై యస్ ఆర్ సి పి నాయకులు, కార్యకర్తలు అయన వెంట పాల్గొన్నారు,

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

**మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరా÷– పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ




మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హొర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగ దారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ట స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.

# అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

## బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం

## తిలకించి, పులకించిన భక్తజనం

**అయోధ్య,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల



నేతృత్వంలో రూపొందించిన ఆఎ÷–టో–మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎ÷–లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై





శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

-------------------

# టీవీ రేటింగ్స్‌పై కేంద్రం కొత్త పాలసీ...

**మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
దేశంలో టెలివిజన్ ఆడియన్స్ మెజర్‌మెంట్ వ్యవస్థలో పారదర్శకత, స్వాతంత్ర్యం, జవాబుదారీతనాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'టీవీ రేటింగ్స్ పాలసీ 2026'ను శుక్రవారం ఆవిష్కరించింది. 2014 నాటి మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ రంగంలోకి కొత్త సంస్థలు ప్రవేశించడాన్ని సులభతరం చేస్తూ, సరసమైన పద్ధతులు, కచ్చితమైన డేటా సేకరణ, బలమైన పర్యవేక్షణ ఉండేలా ఈ పాలసీని రూపొందించారు.సరికొత్త నిబంధనల ప్రకారం, టీవీ రేటింగ్ ఏజెన్సీగా కార్యకలాపాలు ప్రారంభించాలనుకునే కంపెనీలకు ప్రవేశ నిబంధనలను ప్రభుత్వం గణనీయంగా సడలించింది. గతంలో ఉన్న రూ.20 కోట్ల నికర విలువ (నెట్‌వర్త్) ఆవశ్యకతను రూ.5 కోట్లకు తగ్గించింది. ఈ రంగంలో మరింత పోటీని ప్రోత్సహించి, కొన్ని సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.

రేటింగ్ ఏజెన్సీల నిష్పాక్షికతను, స్వతంత్రతను కాపాడేందుకు పాలసీలో కఠినమైన నిబంధనలు చేర్చారు. ఏజెన్సీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో కనీసం సగం మంది బ్రాడ్‌కాస్టర్లు, ప్రకటనకర్తలు లేదా అడ్వర్టైజింగ్ ఏజెన్సీలతో ఎలాంటి సంబంధం లేని స్వతంత్రులుగా ఉండాలని తప్పనిసరి చేశారు. అలాగే, తమ నిష్పాక్షికతకు భంగం కలిగించేలా ఎలాంటి కన్సల్టెన్సీ





పనులు చేపట్టకుండా ఏజెన్సీలపై నిషేధం విధించారు.డేటా కచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు, శ్యాంపిల్ సైజును భారీగా పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు ఆరు నెలల్లోగా, కొత్తగా వచ్చేవి 18 నెలల్లోగా తమ మీటర్డ్ ఇళ్ల సంఖ్యను 80,000కు పెంచాలి. భవిష్యత్తులో ఈ సంఖ్యను 1,20,000 ఇళ్లకు విస్తరించనున్నారు. అంతేకాకుండా, కేబుల్, డీటీహెచ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, కనెక్టెడ్ టీవీలతో సహా అన్ని మాధ్యమాల్లో వీక్షకుల డేటాను సేకరించేలా సాంకేతికతతో సంబంధం లేకుండా ఈ వ్యవస్థను రూపొందించారు.పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, రేటింగ్ ఏజెన్సీలు తాము అనుసరించే పద్ధతులను, అనామక డేటాను తమ వెబ్‌సైట్లలో ప్రచురించాలని ఆదేశించారు. అదే సమయంలో, వీక్షకుల వ్యక్తిగత సమాచార భద్రత కోసం 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్, 2023'కు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు ద్వంద్వ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

దీని ప్రకారం త్రైమాసిక అంతర్గత ఆడిట్లు, వార్షిక బాహ్య ఆడిట్లు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మంత్రిత్వ శాఖ ఒక 'ఆడిట్ అండ్ ఓవర్‌సైట్ టీమ్'ను కూడా ఏర్పాటు చేయనుంది. ఈ మార్పులతో బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో విశ్వసనీయమైన, పారదర్శకమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# మండు వేసవిలో సూపర్ డ్రింక్స్!

**మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**
రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో వేసవి తాపం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సీజన్‌లో శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. శీతల పానీయాల వైపు మొగ్గు చూపే బదులు, సహజ సిద్ధంగా లభించే పానీయాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు చల్లదనం కూడా లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.వేసవిలో శరీరానికి చల్లదనాన్ని, ఆరోగ్యాన్ని అందించడంలో సహజ పానీయాలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది కొబ్బరి నీరు. ఇందులో సహజ ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా ఉండి, శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి అందిస్తుంది. అలాగే,




విటమిన్ సి సమృద్ధిగా ఉండే నిమ్మరసం రోగనిరోధక శక్తిని పెంచి వడదెబ్బ నుంచి కాపాడుతుంది.శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో చెరుకు రసానికి సాటి లేదు. ఇది అలసటను తగ్గించి కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇక సహజ ప్రోబయోటిక్ అయిన మజ్జిగ జీర్ణవ్యవస్థకు మేలు చేయడమే కాకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. సంప్రదాయ పానీయమైన రాగి జావ ఎముకలకు బలాన్నిస్తూ శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.అధిక నీటిశాతం ఉండే పుచ్చకాయ జ్యూస్ శరీరానికి తక్షణ హైడ్రేషన్ అందించి, చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. కాబట్టి ఈ వేసవిలో కృత్రిమ పానీయాలకు బదులుగా సహజంగా లభించే ఈ డ్రింక్స్‌ను డైట్‌లో చేర్చుకోవడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. అన్నింటికీ మించి.. వేసవిలో మంచినీరు ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచింది. చెమట రూపంలో బయటికిపోయే ద్రవాలను భర్తీ చేయడంలో నీటిది కీలకపాత్ర.

# గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో భారీ స్థాయిలో చమురు తెట్టు

## సముద్ర జీవులపై తీవ్ర ప్రభావం

**మెక్సికో,మార్చి27:**
గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు,



ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి, సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. అదనంగా, కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. ఇంకా ?. మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని వందలాది చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికార సిబ్బంది శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.

------------

# 30న బీహార్ సిఎంగా నితీశ్ రాజీనామా

**పాట్నా,మార్చి27::** బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖారారైందని చెబుతున్నారు. మార్చి 16న బిహార్ నుంచి రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, బిహార్, ఒడిశా, హర్యానాలోని 11 సీట్లకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. తక్కిన స్థానాలకు ఎన్నికలకు ముందే పోటీలేకుండా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, జేడీయూ అధ్యక్ష పదవికి నితీశ్ కుమార్ ఈనెల 24న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నితీశ్ మినహా ఎవరూ ఈ పదవికి నామినేషన్ వేయలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023 డిసెంబర్‌లో జేడీయూ అధ్యక్ష పదవికి లలన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఆ పదవిని నితీశ్ నిర్వహిస్తున్నారు. అయితే కేం÷–దరంలో ఆయనకు కీలక మంత్రి పదవి కట్టబెట్టే అవకాశం ఉంది. ఈ కారణంగానే అతను రాజీనామా చేశారని అంటున్నారు.

-----

# వడ్డెర సంఘాల ఏర్పాటు

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం -మీడియాతో మంత్రి సవిత వెల్లడి




**అమరావతి,మార్చి27::** నూతన వ్డదెర సొసైటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. వడ్డెర్లకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారన్నారు. వ్డదెర్ల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పించారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమితోనే వ్డదెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు అని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మైనింగ్ లీజుల్లో వ్డదెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. సీనరేజీలో 50 శాతం మినహాయింపు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పండుగగా వడ్డె ఓబన్న జయంతిని నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. మైనింగ్ లీజుల్లో రిజర్వేషన్ల కేటాయింపు, 50 శాతం సీనరేజీ మినహాయింపు చర్యలపై వ్డదెర కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితకు వ్డదెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు వ్డదెర్లు పాలాభిషేకం చేశారు.

# రాయవరం ప్రమాదంలో బస్సు యజమాని అరెస్ట్

**మార్కాపురం,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి.హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం తర్వాత ప్రయాణికులను వదిలేసి అతడు పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఇవాళ సాయంత్రం మార్కాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

----------

# ప్రజాసేవే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

## కుప్పంలో పలువురికి కుట్టుమిషన్లు పంపిణీ



**చిత్తూరు,మార్చి 27:**

కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

-----

# సూర్యఘర్ పనులను వేగవంతం చేయాలి

## సిఎండిలను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి



**అమరావతి,మార్చి 27:**

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎండీలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా పీఎం సూర్యఘర్ కనెక్షన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై సీఎండీలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతంగా చేపట్టాలని మంత్రి తెలిపారు. జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి అంబేడ్కర్ జయంతి నాటికి ప్రతీ నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ ప్రమాదాలు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో శాఖాధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

------- -------------

# సింహాచలకొండపై వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దారుణం

## సెక్యూరిటీ సూపర్‌వైజర్‌పై ముసుగుదొంగల దాడి

## గాయపడ్డ లక్ష్మణ్ రావును హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు



**విశాఖపట్నం,మార్చి 27(:** సింహాచలంలో దారుణం చోటు చేసుకుంది. సింహాచలం కొండపై శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావుపై ముసుగు ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. కొండ దిగువన ఉన్న ఆలయ ప్రాంగణంలో ఈ ఘటన జరిగింది. కర్రలతో లక్ష్మణరావు ముఖం, తలపై బలంగా కొట్టడంతో.. అతని దవడ ఎముక విరిగి తీవ్ర రక్తస్రావం అయింది. తీవ్ర గాయాలపాలైన లక్ష్మణరావును స్థానికులు వెంటనే గోపాలపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గత పదేళ్లుగా సింహాచలం ఆలయంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావుపై రెండేళ్ల క్రితం కూడా ఇదే తరహాలో దాడి జరిగినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి ఆధారం తండ్రి మాత్రమేనని.. దేవస్థానం అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడి కుమారుడు వేడుకున్నారు. విషయం తెలిసిన వెంటనే గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మణరావుపై గంజాయి గ్యాంగ్ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వరుసగా దాడులు జరుగుతున్నా దేవస్థానం అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

# ఘనంగా రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు

**'రెడీ టు సెర్వ్' వృద్ధాశ్రమానికి చిరంజీవి సాయం - వృద్ధులకు ఆహారం వడ్డించి, వారికి కొత్త బట్టలు పంపిణీ చేసిన చిరంజీవి**

**చిరంజీవి విరాళం వృద్ధశ్రామానికి శాశ్వత స్థలం ఏర్పాటుకు వినియోగిస్తామన్న నిర్వహకులు పెద్ది శంకర్**





**హైదరాబాద్):మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు జుబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఘనంగా జరిగాయి. తన తనయుడు చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ఈ వేడుకలను నిర్వహించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిరంజీవి తన ఉదారతను చాటుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా చిరంజీవి 'రెడీ టు సెర్వ్' వృద్ధాశ్రమానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆశ్రమ నిర్వాహకులు పెద్ది శంకర్ కు అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు చరణ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త బట్టలు పంపిణీ చేయడంతో పాటు, వారికి ప్రత్యేకంగా భోజనాన్ని స్వయంగా వడ్డించారు.

వృద్ధులకు సేవ చేయడంలో 'రెడీ టు సెర్వ్' సంస్థ చూపిస్తున్న చొరవను చిరంజీవి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు పెద్ది శంకర్ చేస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.

మెగాస్టార్ చిరంజీవి తమ ఆశ్రమానికి అందించిన విరాళం,మద్దతు పట్ల నిర్వాహకులు పెద్ది శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చరణ్ పుట్టినరోజున తమ ఆశ్రమంలోని వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు నింపడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మరెందరో వృద్ధులను చేరదీసే క్రమంలో వృద్ధశ్రామానికి శాశ్వత నివాస స్థలం ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో భాగంగా చిరంజీవి అందించిన ఈ సొమ్మును అందుకోసం వినియోగిస్తామన్నారు. దాతలు ముందుకు వచ్చి వృద్ధశ్రామానికి చేయుతనివ్వాలని నిర్వహకులు శంకర్ విజ్ఞప్తి చేశారు.

# శ్రీవాణి దర్శన టిక్కెట్లలో మార్పులు

## సాంకేతిక ఇబ్బందులు తొలగించిన టిటిడి

**తిరుమల,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**

శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా జారీ చేసే విరాళం ఆధారిత దర్శన టిక్కెట్ల ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ బుకింగ్ విధానంలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టింది. గతంలో ఈ టిక్కెట్లను బుక్ చేసుకునే సమయంలో భక్తులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను, ముఖ్యంగా పేమెంట్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. దీనివల్ల భక్తులు ఎటువంటి తడబాటు లేకుండా తమ దర్శన కోటాను సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే భక్తుల సౌకర్యార్థం, ఇప్పుడు విరాళం , దర్శన టిక్కెట్ ధరకు సంబంధించిన మొత్తాన్ని వేర్వేరుగా కాకుండా ఒకే విడతలో చెల్లించేలా మార్పులు



చేశారు. గతంలో ఉన్న సంక్లిష్టమైన పేమెంట్ విధానం వల్ల చాలామందికి ట్రాన్సాక్షన్ మధ్యలోనే ఆగిపోయేది, కానీ ఈ నూతన విధానం అమల్లోకి రావడంతో అటువంటి ఇబ్బందులు ఇకపై ఉండవు. దీనికి అదనంగా, ఒకేసారి గరిష్టంగా నలుగురు భక్తుల వరకు టిక్కెట్లను బుక్ చేసుకునే వెసులుబాటును కూడా టీటీడీ కల్పించింది. ఇది కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ప్రస్తుతం టీటీడీ ప్రతిరోజూ మొత్తం 1500 శ్రీవాణి టిక్కెట్లను జారీ చేస్తోంది. వీటిలో ఆన్‌లైన్ అడ్వాన్స్ రిజర్వేషన్ కోటాను ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు, తద్వారా భక్తులు ముందుగానే తమ ప్రయాణాన్ని ఖరారు చేసుకోవచ్చు. ఇక తక్షణమే టిక్కెట్లు కావాలనుకునే వారి కోసం ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మరోవైపు, తిరుపతి విమానాశ్రయంలో కేటాయించిన 200 ఆఫ్-లైన్ టిక్కెట్ల విషయంలో మాత్రం టీటీడీ నిబంధనలను కఠినతరం చేసింది. విమానంలో వచ్చే భక్తులు తమ బోర్డింగ్ పాస్ చూపించిన తర్వాతే ఈ టిక్కెట్లను జారీ చేస్తారు. ఈ మార్పులన్నీ భక్తుల దర్శన అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.

# దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం

**నోయిడా జేవార్‌లో అందుబాటులోకి భారీ ఎయిర్‌పోర్టు**

**నేడు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**



**న్యూఢిల్లీ,మార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**

దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ విమానాశ్రయం దేశ రాజధాని ప్రజలకు విమాన ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ ఎయిర్‌పోర్టును ప్రధాని మోడీ శనివారం ప్రారంభించనున్నారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే ఉంది. ఒక్కోసారి కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకోలేకపోతుంది. దీంతో ఎప్పటినుంచో మరో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.11,200 కోట్ల వ్యయంతో నోయిడాలోని జేవార్ ప్రాంతంలో రెండో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ విమానాశ్రయాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్మించారు. 3,900 మీటర్ల పొడవైన రన్‌వే.. ఏటా 12 మిలియన్ల ప్రయాణికులు ప్రయాణం చేసేలా అత్యంత అద్భుతంగా నిర్మించారు. తాజాగా ఓపెనింగ్‌కు సిద్ధమైంది. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశ ప్రారంభం కానుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. అనంతరం టెర్మినల్‌ను మోడీ పరిశీలించనున్నారు. ఇక ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభం కాగానే ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ తగ్గి.. విమానాల సామర్థ్యం పెరుగుతుంది. మొదటి దశలో విమానాశ్రయం సంవత్సరానికి 12 మిలియన్ల (2 కోట్ల) మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. తదుపరి దశలలో ఈ సామర్థ్యాన్ని 70 మిలియన్ల (7 కోట్ల) మంది ప్రయాణికులకు విస్తరింపజేస్తారు. ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు, ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, ఆధునిక లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం యమునా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉంది. మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించారు. ఇది రోడ్డు, రైలు, మెట్రో, ఇతర ప్రాంతీయ రవాణా మార్గాల ద్వారా అద్భుతమైన కనెక్టివిటీని అందిస్తుంది. విమానాశ్రయం డిజైన్, ఘాట్‌లు, భవనాలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో 24 గంటల విమాన సర్వీసులను అందించనుంది.


నేటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్ వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది.

# వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

**తాడేపల్లిమార్చి 27 ( రిపబ్లిక్ న్యూస్ )**

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.





# కుస్తీ యోధుడిగా రామ్ చరణ్..

## అంచనాలు పెంచిన 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు.

ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది.విజువల్స్‌లో రామ్ చరణ్ మేకోవర్ అద్భుతమనే చెప్పాలి. కండలు తిరిగిన శరీరంతో, ఒంటి నిండా మట్టి పూసుకుని, చేతిలో గద పట్టుకుని నడుస్తున్న చరణ్‌ను చూస్తుంటే, 'రంగస్థలం'లోని చిట్టిబాబును మించిన మాస్ అవతార్ అనిపిస్తోంది. ఆయన కళ్లలో కనిపించే పౌరుషం, గంభీరమైన నడక గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది.

# సోదరుణ్ణి కోల్పోయా.. ఆ గడ్డి మందును బ్యాన్ చేయండి

## : నటుడు రాహుల్ రామకృష్ణ



ప్రముఖ సినీ నటుడు రాహుల్ రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక విజ్ఞప్తి చేశారు. అత్యంత ప్రమాదకరమైన 'పారాక్వాట్' అనే కలుపు (గడ్డి) మందును తక్షణమే నిషేధించాలని ఆయన కోరారు. మార్కెట్లో సులభంగా దొరుకుతున్న ఈ విష రసాయనం కారణంగా తాను తన సోదరుణ్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్యలకు సులభమైన మార్గంగా మారిందని, ఎందరో ప్రాణాలను బలిగొంటోందని చెబుతూ తెలంగాణ సీఎంవో, ప్రధానమంత్రి కార్యాలయాలను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.పారాక్వాట్ అనేది పొలాల్లో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు విరివిగా ఉపయోగించే ఒక రసాయనం. ముఖ్యంగా పత్తి వంటి మెట్ట పంటలు, వరి పొలాల గట్ల మీద పెరిగే గడ్డిని తొలగించడానికి దీనిని వాడతారు. తక్కువ ధరకే లభించడంతో దాదాపు ప్రతి రైతు ఇంట్లోనూ ఇది అందుబాటులో ఉంటోంది. అయితే, ఇదే అనేక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. క్షణికావేశంలో ఇంట్లో గొడవలు పడినవారు లేదా ఇతర సమస్యలతో బాధపడేవారు దీనిని తాగి ప్రాణాలు తీసుకుంటున్నారు.ఈ కలుపు మందు అత్యంత విషపూరితమైనది కావడంతో కొద్ది మోతాదులో తాగినా ప్రాణాలు కాపాడటం దాదాపు అసాధ్యమని వైద్యులు చెబుతున్నారు. ఆవేశం తగ్గాక బతకాలని వేడుకున్నా, వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని, శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వివరిస్తున్నారు. ఈ విషం చర్మంపై పడినా, వాసన పీల్చినా ప్రమాదకరమే.ఈ మందు తాగి తెలంగాణలో ఏటా 6 వేల మంది వరకు చనిపోతున్నారని అంచనా

తెలంగాణలో పారాక్వాట్ తాగి ఏటా సుమారు 5,500 నుంచి 6,000 మంది చనిపోతున్నారని అంచనా. దేశవ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు 1000 కేసులు నమోదవుతున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, 'డాక్టర్స్ ఎగైనెస్ట్ పారాక్వాట్ పాయిజన్' వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. కనీసం మండల వ్యవసాయ అధికారి సిఫార్సుతో, ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి విక్రయించేలా నిబంధనలు కఠినతరం చేయాలని పలువురు సూచిస్తున్నారు.



# మహిళలు 'సారీ' చెప్పే అలవాటును ఆపాలి

## : సమంత

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు.సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు.



# పెళ్లిపై నాకు మంచి అభిప్రాయం లేదు

## : సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది.అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్నితత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# తిరుమలలో సింపుల్ గా బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి?

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి వార్తలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. డెస్టినేషన్ వెడ్డింగ్స్ హడావుడిలో ఉన్న నేటి కాలంలో, ఈ యువ హీరో మాత్రం ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో అత్యంత నిరాడంబరంగా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం.



బెల్లంకొండ శ్రీనివాస్ తన మనసు గెలిచిన అమ్మాయి కావ్యను మనువాడబోతున్నారు. ఈ నెల మొదట్లో జరిగిన ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లో ఆమెను పరిచయం చేసినప్పుడే అందరూ అది నిశ్చితార్థం అనుకున్నారు, కానీ అది కేవలం ఇరు కుటుంబాలు కలుసుకున్న సందర్భం మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇక ఇప్పుడు పెళ్లికి సంబంధించిన కీలక తేదీలు బయటకు వచ్చాయి. ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో బెల్లంకొండ శ్రీనివాస్ - కావ్యల నిశ్చితార్థం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 29న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా తిరుమలలో వీరిద్దరి వివాహం చాలా సింపుల్‌గా, కేవలం సన్నిహితుల సమక్షంలో జరగబోతోంది. మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నాయకుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.

# నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' వచ్చేస్తున్నాడు..

అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ ప్రకటనతో నాగశౌర్య అభిమానులు, సినీ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రామ్ దేశిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. "విజయాన్ని, ఉత్సాహాన్ని, హై-వోల్టేజ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి" అంటూ నిర్మాణ సంస్థ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

ఈ టీజర్‌లో నాగశౌర్య రగ్డ్, అగ్రెసివ్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు, హై-ఆక్టేన్ మూమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకుంది. నాగశౌర్యతో పాటు సముద్రఖని, నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ వంటి కీలక నటీనటులు కనిపించడంతో, సినిమాలో యాక్షన్‌తో పాటు కామెడీ కూడా ఉంటుందని స్పష్టమవుతోంది.ఈ చిత్రంలో నాగశౌర్య సరసన విధి హీరోయిన్‌గా నటిస్తుండగా, తమిళ నటుడు సముద్రఖని 'వరదా రెడ్డి' అనే కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ ప్రముఖ సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్. చాలా కాలం తర్వాత ఆయన ఈ చిత్రంతో తెలుగులోకి రీఎంట్రీ ఇస్తున్నారు. రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.



# జిల్లాలో "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్"

## అమలుకు కట్టుదిట్టమైన చర్యలు

### స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, బ్యూరోమార్చి 27 (రిపబ్లిక్ న్యూస్):**
స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్" (వ్యర్థ రహిత సంస్థలు) థీమ్ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తదితర సంస్థల్లో సమగ్రంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ అమలుపై అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్' థీమ్‌తో స్థిరమైన పారిశుద్ధ్య సంస్కృతికి నాంది పలికే ఉద్యమంగా భావించి కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి సంస్థను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.



**వ్యర్థాల వర్గీకరణలో 100% అమలు - మూలంలోనే పరిష్కారం**

-ప్రతి గృహం, ప్రతి సంస్థ స్థాయిలోనే తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడం తప్పనిసరి.
-తడి వ్యర్థాలను కంపోస్ట్ పిట్లలో లేదా చెత- నుండి సంపద కేంద్రాల ద్వారా ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా మార్చాలి.
-పొడి వ్యర్థాలను శాస్రీ-యంగా సేకరించి రీసైక్లింగ్‌కు పంపించి ఆదాయ వనరుగా మలచాలి.
-ప్రమాదకర వ్యర్థాలను విడిగా సేకరించి సంబంధిత సంస్థలకు అప్పగించాలి.
ప్రతి ప్రభుత్వ సంస్థలో మౌలిక సదుపాయాలు తప్పనిసరి
-గ్రీన్ (తడి), బ్లూ (పొడి), రెడ్ (ప్రమాదకర) డస్ట్‌బిన్‌లను ప్రతి కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీలో ఏర్పాటు చేయాలి.
-ప్రతి సంస్థలో కంపోస్ట్ పిట్ నిర్మాణాన్ని రేపటి నుంచే ప్రారంభించాలి.
-వర్షపు నీటి నిల్వ కోసం రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను శాస్రీ-యంగా ఏర్పాటు చేయాలి.
ప్లాస్టిక్ రహిత వాతావరణం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
-సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూరి-గా తగ్గించాలి.
-ప్రతి సంస్థను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు హరిత రాయబారులు, స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యం కావాలి.
-పరిశుభ్రత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి.

**నెట్ జీరో లక్ష్యంతో ముందడుగు**

-ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సోలార్ పవర్ వైపు మళ్లించాలి.
-విద్యుత్ వినియోగంలో పొదుపు అలవాట్లను ప్రతి ఉద్యోగి పాటించాలి.
-కంపోస్ట్ ద్వారా తయారైన ఎరువును మొక్కల పెంపకానికి వినియోగించాలి.
విద్యార్థుల్లో అవగాహన – భవిష్యత్‌కు పునాది
-జీరో వేస్ట్, నెట్ జీరో అంశాలపై పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు నిర్వహించాలి.
-చిన్నప్పటి నుంచే వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కల్పించాలి.

**పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు**

-స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలి.
-ప్రతి యూనిట్‌లో డస్ట్‌బిన్‌లు, కంపోస్ట్ పిట్లు, ప్లాస్టిక్ ఫ్రీ వాతావరణంపై ఫోటోలు తీసి ఎస్ ఏ ఎస్ ఏ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
-గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలి.

**ప్రత్యేక సూచనలు**

-మునిసిపల్, తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు తమ సొంత నిధులతో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి.
-అపార్ట్‌మెంట్ అనుమతుల సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి.
-బిసి వెల్ఫేర్, మహిళా శిశు సంక్షేమ, ఐటీడీఏ పరిధిలోని అన్ని సంస్థల్లో జీరో వేస్ట్ విధానాన్ని అమలు చేయాలి.
జిల్లాలోని ప్రతి ప్రభుత్వ సంస్థను "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్"గా తీర్చిదిద్దడం ద్వారా నంద్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# శ్రీ సుంకులమ్మ దేవాలయంలో వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం

**శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా 700 మంది పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ**



**నంద్యాల మార్చి 27 (రిపబ్లిక్ న్యూస్) :**
శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా సుంకులమ్మ వీధిలో ఉన్న ఈ సుంకులా పరమేశ్వరి దేవస్థానం ఉత్సవ మండపంలో శ్రీ సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

కళ్యాణ దాతలుగా భూమా మల్లికార్జున శెట్టి,బిలకంటి హరినాధ బాబు కుటుంబ సభ్యులు, దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిపించారు. ఆలయ పురోహితులు గుండంపాటి వేణుగోపాల శర్మ, దత్తయ్య శర్మ కళ్యాణ క్రతువు నిర్వహించారు.

కళ్యాణం అనంతరం పలువురు దాతల సహకారంతో 700 మందికి పైగా భక్తులకు పానకం,వడపప్పు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకులా పరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మన్ డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, కార్యదర్శి చిమ్మా నాగన్న, ఉపాధ్యక్షులు యంచర్ల నరసింహయ్య, సంయుక్త కార్యదర్శి బైగ్గారి మురళి కృష్ణ, కోశాధికారి బైగ్గారి చిన్న ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఓజా ప్రసాద్, బైగ్గారి సురేష్, మనోజ్, ఓజా సుబ్బయ్య (నాగిశెట్టి) తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

## - అంగరంగ వైభవంగా సీతా రాముల వారి కళ్యాణం

**మహానంది, మార్చి 27,( రిపబ్లిక్ న్యూస్)**
మహానంది క్షేత్రంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం వేద పండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు, అర్చకులు ఉదయం కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్థానిక కళావేదిక మండపం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. బెంగళూరు నగరానికి చెందిన నారాయణ ప్రసాద్, కవిత దంపతులు కళ్యాణ మహోత్సవానికి సహకరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వారితో పాటు ఆలయ అభివృద్ధికి సహకరించే ప్రముఖ దాతలైన అవ్వారు గౌరీనాథ్, సరస్వతి దంపతులతో పాటు హైదరాబాద్ నగరానికి చెందిన వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు కళ్యాణ మహోత్సవంలో తమ వంతు సహకారం అందించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పీఠార్చన, కంకణ ధారణ, యజ్ఞోపవీత సమర్పణ సుముహూర్తం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర క్రతువులతో కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవారికి హనుమద్వాహనంపై గ్రామోత్సవం కనుల పండుగగా సాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన పూజ కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.







# జాతీయస్థాయి దివ్యాంగ క్రీడా విజేతకు సత్కారం

**. షాట్ పుట్ లో జాతీయస్థాయిలో రజత (సిల్వర్ మెడల్) పతకం సాధించిన గౌతమ్**
**- అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడానికి జాతీయ స్థాయి కోచింగ్ కు ఎంపికైన గౌతమ్**
**- సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్**
**. దివ్యాంగ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల ఫిబ్రవరి 27(రిపబ్లిక్ న్యూస్) :**
ఈనెల 18వ తేదీ నుండి 21వ తేదీ భువనేశ్వర్ లో ఉన్న కళింగ స్టేడియంలో జరిగిన 24వ జాతీయ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తరపున పాల్గొన్న నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గౌతమ్ షాట్ పుట్ క్రీడా విభాగంలో సిల్వర్ మెడల్ (రజత పతకం) సాధించిన సందర్భంగా గురువారం స్థానిక నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ ను శాలువా, బహుమతులతో ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొని గౌతమ్ ను అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ, సోమేశుల నాగరాజు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు గౌతమ్ గత నెల నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొని రజత పతకం సాధించడం ప్రశంసనీయమన్నారు. అంతర్జాతీయ పోటీలలో దేశం తరఫున పాల్గొనడానికి బెంగళూరులో ఉన్నతస్థాయి శిక్షణ కోసం గౌతమ్ ఎంపిక కావడం విశేషం అన్నారు.

గౌతమ్ అంతర్జాతీయ దివ్యాంగ క్రీడలలో దేశానికి పతకం సాధించి భారత దేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు.


క్రీడలలో ఆసక్తి ఉన్న దివ్యాంగులు దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదిస్తే తగిన విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర రెడ్డి, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మేడం చంద్రశేఖర్, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

# ఉమ్మడి కర్నూలు జిల్లాలో..
# 21 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు

**న్యాయ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేక కృషితో..**
**కర్నూలు, నంద్యాల లో జిల్లా జడ్జి క్యాడర్ కోర్టులు**
**ఆదోని, ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి క్యాడర్ కోర్టులు**
**శ్రీశైలంలో కొత్త జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు**
**మరో 16 జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు కూడా**

**కర్నూలు/నంద్యాల:మార్చి27(రిపబ్లిక్ న్యూస్) :**
రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర పడిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏకంగా 21 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా, ప్రస్తుతం నంద్యాల అసెంబ్లీ స్థానం నుండి శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్ఎండి ఫరూక్ స్థానిక జిల్లాల్లో కొత్త కోర్టు ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో కొత్త కోర్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో న్యాయవాద వర్గాల్లో హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయి.




**పెండింగ్ కేసుల పరిష్కారం కోసం**

రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో పెండింగ్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని , వాటి పరిష్కారం కోసం, సత్వర న్యాయం కోసం కొత్త కోర్టులు మరియు అదనపు కోర్టు లను ఏర్పాటు చేసేందుకు న్యాయశాఖ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా పెండింగ్ కేసుల సంఖ్య ఆధారంగా 2026-2027 ఆర్థిక సంవత్సరంలో హైకోర్టు రిజిస్టార్( పరిపాలన విభాగం) ప్రతిపాదించిన 96 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేసింది. కొత్త మరియు అదనపు కోర్టు ల్లో విధి నిర్వహణ కోసం 1730 పోస్టులు సృష్టించుటకు కూడా ఆమోద ముద్ర వేయడం జరిగింది.

**ఉమ్మడి జిల్లాలో 21 కోర్టుల ఏర్పాటు**

ఉమ్మడి కర్నూలు జిల్లా లోని వివిధ నియోజకవర్గాల పరిధిలో 21 కొత్త మరియు అదనపు కోర్టు లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రెండు అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులు, రెండు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు,17 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 12 జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులలో భాగంగా ఉమ్మడి జిల్లాలో కర్నూలులో 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు, నంద్యాలలో 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన 25 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులలో భాగంగా, ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదోనిలో ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు



చేయనున్నారు. జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏర్పాటు లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 59 కోర్టుల్లో, ఉమ్మడి కర్నూలు జిల్లా కు 17 కోర్టులు మంజూరు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందులో ఆదోనిలో మూడవ అదనపు సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, ఆళ్లగడ్డలో ఒకటవ, ఆలూరు లో ఒకటవ, ఆత్మకూరులో ఒకటవ, బనగానపల్లెలో ఒకటవ, డోన్ లో రెండవ, కర్నూలులో 5,6,7,8 వ అదనపు కోర్టులు, నందికొట్కూరులో ఒకటవ, నంద్యాలలో 2,3,4 అదనపు సివిల్ జడ్జి కోర్టులు, పత్తికొండలో ఒకటవ, ఎమ్మిగనూరులో ఒకటవ అదనపు సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు కానున్నాయి. కాగా శ్రీశైలంలో కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేస్తున్నారు.

**పెండింగ్ కేసుల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు**
**- రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రకారం ఏ కేసు కూడా ఐదు సంవత్సరాలకు మించి పెండింగ్ లో ఉండరాదు. రాష్ట్రంలో పెండింగ్ కేసుల సంఖ్య 01-01-2019 నాటికి 5,38,020 ఉండగా, ఈ సంఖ్య 01-01-2025 నాటికి 8,93,993 కు చేరింది. కానీ కోర్టుల సంఖ్య మాత్రం ఈ కాలంలో 636 నుండి 660 కి మాత్రమే పెరిగింది. దీంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఆర్థిక శాఖ 2026-27 కు గాను 100 కోర్టులు ఏర్పాటు చేయుటకు సమ్మతి తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న జ్యుడీషియల్ జిల్లాలతో పాటు,రాబోయే కొత్త జ్యుడీషియల్ జిల్లాలలో 172 క్రొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు చేసేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) వారు ప్రతిపాదన పంపించారు. ఇందులో 96 కోర్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 21 కొత్త కోర్టులు మంజూరు కావడంతో పెండింగ్ కేసుల పరిష్కారంతోపాటు, సత్వర న్యాయ సేవలు సులభతరం గా అందనున్నాయి. రాష్ట్రంలో 96 కోర్టులు, 1730 పోస్టులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రివర్గ సహచరులకు,హై కోర్టుకు మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com